క్లుప్తంగా

చెరువు పనుల పరిశీలన



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ శివారులో ని మంగమోని చెరువులో జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను సోమవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమృత్‌సరోవర్ ద్వారా చెరువుల మరమ్మతు పనులు జరుగుతున్నాయని, దీంతో చెరువులో నీటి నిల్వలు పెరిగి భూగర్భ జలాలు పెరిగేందుకు దోహద పడుతుందన్నారు. ఆయా పనులు నిబంధనల మేరకు నాణ్యతగా నిర్వహించాలన్నారు.

'సినారె'కు ఘన నివాళి



వనపర్తి టౌన్: జ్ఞానపీఠ, నంది అవార్డు గ్రహీత సినారె సాహిత్య ప్రపంచానికి చెరగని చిరునామా అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ పేర్కొన్నారు. సోమవారం సింగిరెడ్డి నారాయణ రెడ్డి 7వ వర్ధంతిని పురస్కరించుకొని టీజేపీసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. మనసు దోచే మధురమైన పాటలను అందించిన పూదోట, తెలంగాణ ముద్దబిడ్డ, పద్మానికి పట్టం కట్టి, గద్యానికి గజ్జ కట్టి, గేయాలతో వియ్యం పొంది, గజల్స్‌తో విజిల్స్ వేయించిన సినారె ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కవులు గిరిజారాచారి, విభూవి ఈశ్వర్, మండ్ల దేవన్న నాయుడు, తగవుల వెంకటస్వామి, నిదర్శన్‌గౌడ్, గంధం ఆంజనేయులు, శివుడు, కర్నాకర్‌రెడ్డి, రాఘవేందర్, వేణు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి నిర్ణయంతోనే వాల్మీకి విగ్రహం ఏర్పాటు



పాన్‌గల్: గ్రామస్తుల సమష్టి నిర్ణయంతో గ్రామ నడిబొడ్డున వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేద్దామని గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సోమవారం బండపల్లిలో వాల్మీకి బోయలు రచ్చకట్టపై సమావేశమై వాల్మీకి విగ్రహ ఏర్పాటు విషయంలో పలు తీర్మానాలు చేశారు. వాల్మీకి విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు మంగపతినాయుడు, రమేష్‌నాయుడు, వెంకటయ్యనాయుడు, కృష్ణయ్యనాయుడు మాట్లాడుతూ.. గ్రామంలో విగ్రహ ఏర్పాటు విషయంలో కొందరు ఏకపక్ష నిర్ణయాలతో పని చేయకుండా కమిటీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలన్నారు. విగ్రహ ఏర్పాటు విషయంలో రాజకీయాలకు అతీతంగా సమష్టి పని చేయాలని కోరారు.

పౌల్ట్రీ దుర్గంధంతో ఇబ్బందులు



పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లి శివారులో ఉన్న స్నేహ పౌల్ట్రీ ఫార్మ్స్ నుంచి వచ్చే దుర్వాసనను నియంత్రించాలని కోరుతూ సోమవారం గ్రామస్తులు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. గ్రామ శివారులో నిర్మించిన స్నేహ పౌల్ట్రీ ఫార్మ్‌ల నుంచి ప్రతిరోజూ దుర్వాసన రావడంతో ప్రజలు శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాగే పక్కనే ఉన్న పంట పొలాల్లో పనిచేయడానికి కూలీలు సైతం రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్ తేజస్ చందులాల్‌పవార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జయసుధ, మహేశ్వరి, చెన్నమ్మ, రేణుక, శేషన్నగౌడ్, భాస్కర్‌గౌడ్, గోపాల్, భీసన్న, మణెమ్మ, వెంకటేష్, శివకుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ బంధు' కేటాయించాలి



పెబ్బేరు రూరల్: బీసీ బంధులో వాల్మీకి బోయలకు కూడా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్ కోరారు. సోమవారం ఆయన వాల్మీకులతో కలిసి శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారికి వినతిపత్రం అందజేశారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



పాలికెపాడులో అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

గోపాల్‌పేట: బాల కార్మిక వ్యవస్థను అరికట్టడంలో అందరూ భాగస్వాములు కావాలని బాలల హక్కుల ప్రజాధ్వని తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచుకట్ల సుభాష్ కోరారు. మైనర్లు హోటళ్లు, ఇటుక బట్టీలు, ఇతర దుకాణ సముదాయాల్లో పని చేస్తున్నట్లు కనపడితే వెంటనే బాలకార్మిక నిర్మూలన వ్యవస్థ అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సోమవారం ఆయయ మండలంలోని బుద్దారం, పొలికెపాడు, చెన్నారం, ఏదుట్ల గ్రామాల్లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలపై వేధింపులు జరుగుతున్నట్లు గుర్తిస్తే చైల్డ్‌లైన్ నంబరు 1098, 100 డయల్‌కు చేయాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు గురుమూర్తి, గద్దం రాంబాబు, భీమనపల్లి లింగయ్య, మొండికత్తి అశోక్, ఆకులపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక రహిత సమాజమే లక్ష్యం

చిన్నంబావి: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం గ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ రవినారాయణ మాట్లాడుతూ ప్రతి ఏటా జూన్ 12న ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గ్రామాల్లో బాలకార్మిక రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల కార్మికులను ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే రెవెన్యూ శాఖ కానీ, పోలీస్ శాఖ కానీ, కార్మిక శాఖ కానీ చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కానీ సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ రామస్వామి, ఎస్వీకే కోఆర్డినేటర్ మీసాల మహేష్, పంచాయతీ కార్యదర్శులు వసంత, వెంకటేష్, శ్రీకాంత్, ఎస్వీకే సిబ్బంది హైమావతి, సుమతి, బాలకృష్ణ పాల్గొన్నారు.

విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఖిల్లాఘనపురంలో గంగమ్మను ఊరేగిస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు, గ్రామస్తులు



రావుల చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటు మానాజీపేట గ్రామం సోమవారం గంగమ్మ, ఆంజనేయ స్వామి విగ్రహం, ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో ఉదయం నుంచి ఆలయాల వద్ద గణపతి పూజ, పుణ్యాహవాచనము, గోపూజ, రక్షాబంధనం, యాగశాల ప్రవేశవ, అవాహిత దేవతా హోమాలు, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఖిల్లాఘనపురంలోని నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయం వద్ద గంగమ్మ తల్లి విగ్రహం, శిఖర, ధ్వజస్తంభ ప్రాణప్రతిష్ఠ పూజలు చేశారు. అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో శాసన మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. మానాజీపేటలో శ్రీ ముచ్చింతల ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభం, శిఖర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అందులో భాగంగా సోమవారం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనము, గోపూజ, రక్షాబంధనం, యాగశాల ప్రవేశము, అవాహిత దేవతా హోమాలు, జలాధివాసం తదితర పూజలను పండితులు నిర్వహించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

వనపర్తి: రామ్కీ ఫౌండేషన్ సహకారంతో పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ కో ఆర్డినేటర్ గద్దె భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 28 ఏళ్ల వయస్సు గల యువత వారి విద్యార్హతను బట్టి పది నుంచి డిగ్రీ వరకు బ్యాంకింగ్, ఎలక్ట్రానిక్స్, డిజిటల్ మార్కెటింగ్, జీడీఏ (నర్సింగ్) కోర్సుల్లో రెండు నుంచి నాలుగు నెలలపాటు హైదరాబాద్‌లోని ఒంటిమామిడి ప్రాంతంలో ఉచిత శిక్షణ ఇవ్వటంతో పాటు.. శిక్షణ పూర్తి కాగానే ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని, వనపర్తి ప్రాంత నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ 95424 33427కు సంప్రదించాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి

కొత్తకోట: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ముమ్మళ్లపల్లికి చెందిన నాయిని ప్రవీణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. తనపై నమ్మకంతో తన నియామకానికి సహకరించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేంద్రగౌడ్‌కు ప్రవీణ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఆధ్వర్యంలో జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వడ్డె రాజు, బోయ శ్రీను, రామకృష్ణతో పాటు 100 మంది కార్యకర్తలకు రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ యాదవ్, ఆదిత్యరెడ్డి, రాజీవ్‌రెడ్డి, కిరణ్ కుమార్, మొగిలి సత్యారెడ్డి, అక్కి శ్రీనివాస్‌గౌడ్, విజయవర్ధన్‌రెడ్డి, వెంకట్రాములు, వెంకటేష్‌సాగర్, నరేందర్, సురేందర్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

అమరచింత: పట్టణంలోని జగన్‌వాడలో సోమవారం టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనం చోరీకి గురైందని ఖాజాహుస్సేన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగన్‌వాడలోని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ఇంటికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి వచ్చారని తెలుసుకున్న ఓ దినపత్రిక విలేఖరి తన టీవీఎస్ చాంప్‌ను తీసుకొని ఎమ్మెల్యేను కలవడానికి వెళ్లాడు. ఆయన ద్విచక్రవాహనాన్ని దేవరకొండ పాండు ఇంటి ఎదుట ఉన్న చెట్టునీడలో నిలిపాడు. ఎమ్మెల్యేను కలిసి బయటికి వచ్చే లోగా తన టీవీఎస్ చాంప్‌ను ఎవరో చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ.శివనాగేశ్వర నాయుడు తెలిపారు.

తహసీల్దార్ ఆఫీస్‌లో కిటకిట

వనపర్తి: రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తుల వారికి రూ.లక్ష ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు చేసిన ప్రకటనతో జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కులం, ఆదాయం ధ్రువపత్రాల కోసం జనం పోటెత్తారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున ధ్రువపత్రాల కోసం అర్జీలు రావటంతో గత వారం రోజులుగా.. తహసీల్దార్ ఆఫీస్ కిటకిటలాడుతోంది.



శాగాపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి



డిపో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్, మాధరావుపల్లి, కదిరెపాడు, మైలారం మీదుగా ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కొల్లాపూర్ డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు రాము యాదవ్ మాట్లాడారు. ఆయా గ్రామాల మీదుగా గతంలో నడిచిన ఆర్టీసీ బస్సును కొన్ని నెలలుగా రద్దు చేయడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సును నడిపిస్తామని అధికారులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాల మీదుగా బస్సును పునరుద్ధరించాలని, లేనిచో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, నాగేంద్రం, మైబూషి, బొక్కలయ్య, రాముడు, లక్ష్మయ్య, సుబ్బయ్య, అలవేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



మనిగిళ్ల జెడ్పీ హెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న హెచ్‌ఎం శంకర్‌గౌడ్

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మనిగిళ్ల జెడ్పీహెచ్‌లో సోమవారం విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలను హెచ్‌ఎం శంకర్‌గౌడ్ అందజేశారు. మనిగిళ్ల జెడ్పీహెచ్‌లో పదో తరగతి పూర్తి చేసుకొని గురుకుల కళాశాలలో సీట్లు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని, రూ.వేలు ఖర్చు చేసి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించొద్దని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్, నాగేశ్వరమ్మ తదితరులు ఉన్నారు.

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, భోజనం, మెరుగైన విద్య అందిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న నిక్సన్

మదనాపురం: మహిళా గ్రూపుల అందరికీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పావలా వడ్డీకి నిధులను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మహిళా గ్రూపుల సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. మహిళల అభ్యున్నతి కోసం పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరం మాత్రమే పావలా వడ్డీకి రుణాలు అందించారని, మిగతా ఎనిమిదేళ్లలో ఆ ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పావుల వడ్డీకి రుణాలు విడుదల చేయాలని కోరారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.

తోమాలపల్లిలో తెలంగాణ రన్ ప్రోగ్రాం



పెబ్బేరు: మండలంలోని తోమాలపల్లిలో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మత్స్య కళాశాల ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ ముత్తప్ప ఖావి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదో ఏడాదిలోకి ప్రవేశించిన నేపథ్యంలో మత్స్యరంగంలో ఎన్నో విజయాలు సాధించారని కొనియాడారు. అలాగే రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి, ప్రవేశపెట్టి పథకాలపై వివరాలు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, ఎంపీటీసీ లావణ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ హోన్నానంద తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో నాగల్‌కడ్మూర్

అమరచింత: ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా అంధకారం నెలకొన్న ఘటన మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని చెరువులో విద్యుత్ స్తంభం సోమవారం విరిగిపడటంతో మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సర్పంచ్ రాజేశ్వరమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ట్రాన్స్‌కో ఏఈ రాంచందర్‌కు విషయం తెలిపినా ఫలితం లేదు. దీంతో సర్పంచ్ తమ గ్రామానికి ట్రాన్స్‌కో లైన్‌మెన్ లేకపోవడంతో తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని, సమస్యను పరిష్కరించమని అధికారులకు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో ట్రాన్స్‌కో అధికారులు బిల్లుల వసూళ్లపై సారిస్తున్న దృష్టి సమస్యల పరిష్కారంపై చూపాలని కోరారు. రాత్రివేళ విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలతో పాటు చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిజాయితీ చాటుకున్న 108 సిబ్బంది



సెల్‌ఫోన్స్, నగదును డ్యూటీ డాక్టర్‌కు అప్పగిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని బుగ్గవాగు స్టేజీ సమీపంలో ఎన్‌హెచ్44పై బొలోరో వాహనం అదుపు తప్పి బ్రిడ్జిపై నుంచి కిందికి దూసుకెళ్లింది. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు 108కు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి కొత్తకోట 108అంబులెన్స్ చేరుకుంది. గాయపడిన వారిని వనపర్తి జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. వీరేష్ అనే క్షతగాత్రుడి వద్ద, గాయపడిన మరో వ్యక్తి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.54,500లను ఈఎంటీ ఖాజామైనోద్దీన్, పైలెట్ చంద్రశేఖర్ గుర్తించారు. అంబులెన్స్ సిబ్బంది సెల్‌ఫోన్స్, నగదును ఆస్పత్రి డ్యూటీ డాక్టర్‌కు ఇచ్చి తమ నిజాయితీని చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారిని ప్రాణాలను కాపాడటమే కాకుండా వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్స్ నిజాయితీగా అప్పగించిన అంబులెన్స్ సిబ్బందిని పలువురు అభినందించారు.

పన్నుల పేరుతో ప్రజలకు కుచ్చుటోపీ



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట: ఇంటి పన్నులను పెంచుతూ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటూ కుచ్చుటోపీ పెడుతుందని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్నులను పెంచడాన్ని నిరసిస్తూ సోమవారం కొత్తకోట చౌరస్తాలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించిన అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎమ్మార్ మాట్లాడుతూ.. పెంచిన ఇంటి పన్నులను తక్షణమే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో అడ్డగోలుగా పన్నులను పెంచడం ప్రజలకు భారంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. కొత్తకోట మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నామని ప్రకటనలు తప్ప, స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మున్సిపాలిటీకి ఒరగబెట్టిందేమి లేదన్నారు. మున్సిపాలిటీకి 30 పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల, ఊర్దూ మీడియం డిగ్రీ కాలేజీలను మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే ఇచ్చిన హామీలు గాలి మాటలే అని ఆరోపించారు. మున్సిపాలిటీలో డ్రెయినేజీ నిర్మాణం చేయకుండా డివైడర్ నిర్మాణం చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తు చేశారు. కమీషన్లకు కక్కుర్తి పడటమే బీఆర్‌ఎస్ నాయకులు చెల్లిందన్నారు. కార్యక్రమంలో మేస్త్రీ శ్రీనివాసులు, ప్రశాంత్, బోయేజ్, చీర్ల నాగన్నసాగర్, బాలరాజు, కృష్ణారెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, చీర్ల రాము, చంద్రశేఖర్‌డ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలకు డిమాండ్



ఏఈఓ నరహరికి వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

వనపర్తి టౌన్: జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ జగదీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఏఈఓ నరహరికి ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, సకాలంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరీష్, కేదార్‌నాథ్, శివ, చింటు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త ప్రజాసమస్యలపై పోరాడాలి



బీజేపీ నాయకులతో జలేందర్‌రెడ్డి

అమరచింత: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు జలేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీసీ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మండల బీజేపీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జలేంధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 14న పట్టణంలో మక్తల్ నియోజక వర్గస్థాయి సీనియర్ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని, గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. గతంలో బీజేపీ నుంచి ప్రజాప్రతినిధులుగా గెలిచి ప్రస్తుతం తటస్థంగా ఉన్న వారితో పాటు సానుభూతి పరులను సైతం సమావేశానికి తీసుకొచ్చే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులను వినియోగించుకుంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ తమ సొంత నిధులని ప్రచారం చేసుకోవడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో మేర్వరాజు, క్యామ భాస్కర్, నరాల నారాయణ, అశోక్‌కుమార్, రాకేష్‌శెట్టి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి నృత్య శిక్షణ



జ్యోతి ప్రజ్వల చేస్తున్న వైస్ చైర్మన్ శ్రీధర్

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో స్వర్ణముఖి అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి నృత్య శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని సోమవారం రాత్రి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 45 మంది చిన్నారులు శిక్షణ పొందారని, 35ఏళ్లుగా పట్టణంలో స్వర్ణముఖి అకాడమీ నిర్వాహకురాలు నీరజాదేవి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వేలాదిమంది విద్యార్థులు రాష్ట్ర, దేశ, విదేశాల్లో ప్రదర్శనలు చేశారనిచారని, ఆ ఘనత నీరజాదేవికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బీచుపల్లి యాదవ్, రఘుసురి పాల్గొన్నారు.

బాధితుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల చెందిన బండారు సరోజ, శాంతకుమార్ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాయల్ ఫౌండేషన్ చైర్మన్ కాశిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి బాధితుల కుటుంబాలకు రూ.10వేల ఆర్థికసాయం పంపించారు. నగదును జిల్లా బీఆర్‌ఎస్ మీడియా సెల్ కన్వీనర్ దాడి యోగానందరెడ్డి, దరనీశ్వర్‌శెట్టి సోమవారం బాధిత కుటుంబ సభ్యులు బాలకిష్టమ్మకు రూ.5వేలు, సరోజ పిల్లలకు రూ 5వేలను అందించారు. కార్యక్రమంలో ఎంఏ లతీఫ్, గోవర్ధన్‌రెడ్డి, గంధం శరత్‌బాబు, గంధం విష్ణు, అంకె యాదగిరి, శివయ్య, మద్దిలేటి, తిరుపతయ్య, గంధం రాజు, రంగ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగానే విద్యార్థులు



దావాజిపల్లి పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



ధర్మాపురం శివారు పొలంలో విత్తనాలు నాటుతున్న విద్యార్థులు

పాన్‌గల్: వేసవి సెలవుల అనంతరం సోమవారం తెరుచుకున్న పాఠశాలలకు విద్యార్థులు అంతంత మాత్రమే హాజరైయ్యారు. మొదటి రోజు పాఠశాలలకు వచ్చేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తి చూపలేదు. మండలంలో మూడు యూపీఎస్, 11 ఉన్నత పాఠశాలలు, 36 ప్రాథమిక పాఠశాలల్లో కలిపి మొత్తం 3,800 మంది విద్యార్థులు ఉన్నారు. మొదటి రోజు ఒక్కొక్క పాఠశాలలో పది మంది లోపు మాత్రమే విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలో అత్యధికంగా దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 50 శాతం మంది విద్యార్థులు హాజరైయ్యారు.

బడిబాటలో ఉపాధ్యాయులు: పొలం బాటలో విద్యార్థులు

అమరచింత: ప్రభుత్వం ఆదేశం మేరకు సోమవారం నుంచి విద్యాసంస్థలు తెరుచుకున్నాయి. మొదటి రోజు పాఠశాలలకు విద్యార్థులు కంటే ఉపాధ్యాయులే ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో 2,263 మంది విద్యార్థులు ఉండగా మొదటి రోజు కేవలం 832 మంది మాత్రమే హాజరయ్యారని మండల విద్యాధికారి భాస్కర్ సింగ్ తెలిపారు. కాగా బడిబాట కార్యక్రమం పేరిట ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి విద్యార్థులు పాఠశాలలకు రమ్మని కోరుతున్నా.. చిన్నారులు తమ తల్లితండ్రుల వెంట పొలం పనులకు వెళ్తున్నారు. పొలం పనులతో పాటు ఆటల్లో చిన్నారులు బిజీగా గడిపేస్తున్నారు.